www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025

5

కాకినాడ



నిండుకుండలా 'తాండవ' రిజర్వాయర్

ప్రజాశక్తి - కోటనందూరు

గత 4 రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తాండవ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. తాండవ రిజర్వాయర్ సామర్థ్యం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 376.05 అడుగులకు నీటిమట్టం చేరుకుందని రిజర్వాయర్ డిఇ పి.అనురాధ తెలిపారు. భారీ వర్షాల వల్ల కొండల, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు తాండవ రిజర్వాయర్‌కు చేరుతుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిలువ నిలకడగా ఉంది. రిజర్వాయర్ ఆయకట్టుకు అవసరమైన నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా విడుదల చేస్తున్నట్లు అనురాధ తెలిపారు.



నీటితో కలకలలాడుతున్న రిజర్వాయర్

సకాలంలో పూర్తయ్యేనా..?

- 'ఈ-పంట'తో బహుళ ప్రయోజనాలు
- నత్తనడకన నమోదు కార్యక్రమం
- 36 శాతం దాటని ప్రక్రియ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఈ-పంట నమోదుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలన్నీ రైతులకు సక్రమంగా అందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని నిబంధన సర్కారు విధించింది. దీంతో రైతులంతా ప్రతి వ్యవసాయ సీజన్‌లోనూ ఈ-పంట నమోదు చేయించుకుంటున్నారు. అయితే ఈసారి ఖరీఫ్ పంట కాలంలో ఈ కార్యక్రమం నత్తనడకన సాగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే రైతులు వర్షాలు లేక ఆలస్యంగా నాట్లు వేశారు. ఖరీఫ్ పంట కాలం దాటిపోయింది. మరోవైపు ఇటీవల భారీ వర్షాల వలన నాట్లు వేసిన పలువురు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మళ్ళీ ఏదోలా కష్టపడి పంటను వేశారు. అయితే అధికారులు సకాలంలో ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

త్వరితగతిన పూర్తి చేయాలి



ప్రభుత్వ పథకాలు, నష్టపరిహారాలు అందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. అయితే చాలా చోట్ల ఈ ప్రక్రియ ఇంకా పూర్తిలేదు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని నమోదు ప్రక్రియను వేగవంతం చేసేలా కృషి చేయాలి.

-సిహెచ్.మల్లేష్, రైతు, సామర్లకోట శివారు

అనేక ప్రయోజనాలు

జిల్లాలో సుమారు 2.23 లక్షల ఎకరాల్లో వరి, దాదాపు 70 వేల ఎకరాల్లో పత్తి, అపరాలు, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. పంటలను పండించే రైతులంతా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా రైతుల వద్దకు వెళ్ళి వారు ఏయే పంటలను, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనేది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. తద్వారా ప్రభుత్వం నుంచి అందే పథకాలు వర్తిస్తాయి. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలను రైతులు గనుక నష్టపోతే వారికి నష్టపరిహారం అందుతుంది. దీంతో పాటు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు వర్తిస్తాయి. సచివాలయ వ్యవసాయ శాఖ సిబ్బంది, విఆర్‌ఒలు రైతుల వద్దకు వెళ్లి వారు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. ఏయే పంటలను సాగు చేస్తున్నారో గుర్తించి అక్కడికక్కడే రైతు పొలం వద్ద ఫోటోను తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఏ సర్వే నెంబర్లో, ఎంత విస్తీర్ణంలో సంబంధిత రైతు పంట సాగు చేసుకుంటున్నారో ఇందులో నమోదు చేస్తారు. ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అన్నదాత సుఖీభవ, పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, తుపాను, వరదలు వచ్చినప్పుడు నష్టపోతే అందే పరిహారం వంటి ప్రయోజనాలు అందుతాయి.

నత్తనడకన నమోదు

జిల్లాలో సాగవుతున్న ఖరీఫ్ విస్తీర్ణంలో ఇప్పటి వరకు దాదాపు 36 శాతం అంటే 1 లక్షా 11 వేల ఎకరాల్లో మాత్రమే ఈ-పంట నమోదయింది. ఇంకా సుమారు 90 వేల ఎకరాల్లో నమోదు కావాల్సి ఉంది. అన్ని మండలాల్లోనూ ప్రారంభమైనా అనేక గ్రామాల్లో ఇంకా నమోదు నత్తనడకన సాగుతోంది. సాంకేతిక సమస్యలు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో గడువు లోగా నమోదు ప్రక్రియ పూర్తవుతుందా? లేదా? అన్నది స్పష్టత లేదు. వాస్తవానికి జూలై మొదటి వారంలో నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా ఈ నెలాఖరులోగా పూర్తి కావాల్సి ఉంది. యాప్ సమస్యల వలన ఉన్న సిబ్బంది తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాప్‌ను ఓపెన్ చేసిన వెంటనే సర్వే నెంబరు నమోదు చేయగానే రైతుల వివరాలను చూపుతుంది. కొంత సేపటికి తర్వాత గాని సర్వే నంబర్లు డౌన్‌లోడ్ కావడం లేదని సిబ్బంది తెలిపారు. రైతుల ఫోటోలు, పంట వివరాలు అప్‌లోడ్ కావడానికి ఎక్కువ సమయం పడుతోంది. దీంతో పలు ప్రాంతాల్లో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. పనులు మానుకుని నమోదు కోసం పడిగాపులు కాస్తున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని ఈ-పంట నమోదు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



అధికారులు, రైస్‌మిల్లు అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ : జెసి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో 2025-26 ఖరీఫ్ సీజను ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ సన్నద్ధతపై రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, రవాణా, సహకార, లీగల్ మెట్రాలజీ, భారత ఆహార సంస్థ, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ధాన్యం సేకరణ కేంద్రాలు, సిఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర, బ్యాంకు గ్యారంటీ, గోనె సంచులు, హామాలీల వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెసి రాహుల్ మీనా మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేం దుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి 30 శాతం పూర్తయిందని, సెప్టెంబర్ నెల చివరినాటికి జిల్లాలో నూరు శాతం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న కనీస మద్దతు ధర, ధాన్యం సేకరణ ప్రక్రియపై ఇప్పటినుంచే అవగాహన కల్పించాలన్నారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,890 (75 కేజీలకు రూ.956), సాధారణ రకం క్వింటాకు రూ.2,369 (75 కేజీలకు రూ.948)లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలోని ధాన్యం సేకరణ ప్రక్రియ వినియోగించే వే బ్రిడ్జిలను లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా రైస్ మిల్లులను అనుసంధానం చేసి, ఆర్‌ఎస్‌కెలలో అవసరం మేరకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే రైస్ మిల్లులు తప్పనిసరిగా సిఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.దేవులానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణరాజు, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ జి.ప్రసాద్, రైస్ మిల్లుల అసోసియేషన్ ప్రతినిధులు వి.సూర్యప్రకాశరావు, వి.రుద్రయ్యచౌదరి, ఎం.అప్పారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ఉన్న గ్రామంలోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం పాలిటెక్నిక్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. డిప్లొమా కోర్సులకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఎన్.రాజశేఖర్, డైరెక్టర్ అఖిలేష్, బిటెక్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చిన గర్భిణులకు అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక బంగారమ్మ గుడి వీధి పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గొంతిని శ్రీను, ఏడాకుల దుర్గాప్రసాద్ ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సూర్యచంద్ర, జి.సత్యనారాయణ, రాజశేఖర్, జి.దుర్గ, చింతల ప్రసాద్, నీలం వీరేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది షాపు నెంబర్ 29, 30లో బుధవారం స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంపన రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, నాయకులు గౌతమ్, నాగార్జున, రాజు, లోవరాజు, శ్రీను, రత్నకుమార్, శాంతిస్వరూప్, డీలర్లు యడ్ల సుబ్బారావు, ధూళిపూడి సత్యం పాల్గొన్నారు.



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

నిబంధనల ప్రకారం వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి - సామర్లకోట

వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సిఐ ఎ.కృష్ణభగవాన్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆదేశించారు. బుధశారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గణపతి మండప కమిటీలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4, 6 తేదీల్లో సామర్లకోట, పరిసర ప్రాంతాల్లో నిర్వహించే గణపతి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల్లో ఆయా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు చేసిన ఘాట్ల వద్దే నిమజ్జనాలు చేయాలని సూచించారు. ఊరేగింపులో డిజె బాక్స్‌లు పెట్టకూడదన్నారు. తాజాగా ఒక నిమజ్జన కార్యక్రమంలో డిజె శబ్దం కారణంగా గుండెపోటుతో ఒక వ్యక్తి మృతి చెందారని, కావున కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా వాలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జన రేవుల వద్ద గజ ఈత గాళ్లను సిద్ధంగా ఉంచుతున్నామని, రేవుల్లో బారికేడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చీకటి పడిన తరువాత నిమజ్జనాలు జరగకుండా కమిటీలు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గణపతి మండప కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - శంఖవరం

విద్యారంగలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అన్నవరం దేవస్థానం కాలేజీ ఎదుట పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా విద్యార్థుల సమస్యలను, ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందన్నారు. విద్యార్థుల ఫీజులు యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని హామి ఇచ్చారని, గత రెండేళ్ల ఫీజురీయింబర్స్‌మెంట్ ఒక్క దఫా కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని అన్నారు. దీతో ఫీజులు కడితేనే పరీక్షలు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు, మెస్ ఛార్జీల పెంపుదల తదితర డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు లలిత, పేరూరి సుబ్రహ్మణ్యం, సంతోష్‌కుమార్, యేసు బాబు, నితిన్, చంటి, సుబ్రహ్మణ్యం, సాయి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అంధత్వ నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

జాతీయ అంధత్వ నివారణ పక్షోక్షవాల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిహెచ్‌సి నుంచి కొత్తపేట, గుర్రాల సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికీ చూపును ప్రసాదించవచ్చన్నారు. కార్నియా దెబ్బతినటం వల్ల, జన్యుపరమైన వ్యాధుల వల్ల కంటి చూపు కోల్పోయిన వారికి కంటి చూపు ప్రసాదించవచ్చన్నారు. ప్రజలకు నేత్రదాన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.మానస, డాక్టర్ ఎ.శ్రీనివాస్, రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేడు పంచాయతీ పురోగతిపై శిక్షణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంచాయతీ పురోగతిపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ కె.స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వర్తక సంఘం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని యానం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ అన్నారు. బుధవారం వర్ధక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో బుధవారం మండలంలోని ఆర్‌బి. కొత్తూరు జడ్‌పి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ ఇన్‌ఛార్జ్ బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆమ్లాలు, క్షారాలు, లవణాలు పాఠ్యాంశానికి సంబంధించి ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జి.వేమవరం రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జి.వేమవరం పంచాయితీ జామకాయల తూము నుంచి గొర్రిపూడి వెళ్లే రహదారికి జనసేన నాయకులు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఈ మరమ్మతులు చేపట్టినట్లు సత్తిబాబు తెలిపారు.



మరమ్మతు పనుల్లో పాల్గొన్న జనసేన కార్యకర్తలు

'కమిటీలో ఫౌండర్స్ ట్రస్ట్‌కు చోటు కల్పించాలి'

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థాన కమిటీలో ఫౌండర్స్ సేవా ట్రస్ట్ సభ్యులకు చోటు కల్పించాలని ట్రస్ట్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మహాసంస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడారు. 1982 లో శ్రీపాద శ్రీ వల్లభ ప్రథమ అవతారం దత్తాత్రేయుడు ఆలయాన్ని ఆర్య వైశ్యులు, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఆలయం నిర్మించారని అన్నారు. దశలవారీగా ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన సజ్జన గడ్డ రామస్వామి 1989లో ఆలయ పునర్నిర్మాణం చేశారని అన్నారు. మహాసంస్థానంను 2018లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుందన్నారు. ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆలయ కమిటీలో వైశ్యులకు స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ నేడు వేరే వారి పేర్లు తెరపైకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్ట్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలను దేవదాయ శాఖకు అనుబంధంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మేనేజింగ్ ట్రస్టీ పైండా శ్రీరామ్‌మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులు కుసుమంచి కామేశ్వరరావు, సెక్రటరీగా పైండా సత్యరామన్న, ట్రెజరర్ కప్పల భాగ్యలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయం నుంచి 12 మందికి ఉద్యోగాలు


ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమైన 12 మంది డిఎస్‌సిలో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన 12 మంది బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్.వెంకటరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగాలు పొందిన వారు మాట్లాడుతూ అభ్యాస అనుభవాలను వివరించారు. కార్యదర్శి వెంకటరావు విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. జిల్లాలోని విద్యార్థుల అభ్యాసం కోసం గ్రంథాలయ సౌకర్యాలను మరింత విస్తరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి, ఇన్‌ఛార్జ్ కె.కిషోర్, జిల్లా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జ్ ఎం.శ్రావ్య, కార్యాలయ సిబ్బంది ఎస్.రాజు, టి.సాయివెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలుపుతున్న విజేతలు

కార్టూ'నిజం'



ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం మండలంలోని ఆర్‌ఎస్‌కెలలో ఎలుకల నిర్మూలనకు వినియోగించే మందును రైతులకు పంపిణీ చేశారు. రాయ భూపాలపట్నం ఆర్‌ఎస్‌కె వద్ద జరిగిన అవగాహన సదస్సులో వ్యవసాయ శాఖ ఎడిఎ ఎన్.దైవకుమార్ పాల్గొని మాట్లాడారు. బ్రోమోడయోలిన్ మందును వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్, నూనె రామారావు, ఎన్‌వివి. ప్రసాద్, రైతులు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని బలరాంపురం సర్పంచ్ పైలా సీత అధ్యక్షతన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఎలుకలు వల్ల పంట దిగుబడి తగ్గుతుందన్నారు. అందుకే ప్రభుత్వం ఎలుకల నివారణకు రాయితీపై మందును అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ అధికారి మాధురి, రైతులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని ఆర్‌ఎస్‌కెల వద్ద ఎలుకల నిర్మూలనకు అవసరమైన మందును రైతులకు పంపిణీ చేశారు. ఉండూరు, వల్లూరు, మామిళ్ళదొడ్డి గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయాధికారి వంగపండు మురళీధర్ పాల్గొని మాట్లాడారు. ఎలుకలకు ఎరలు ఎలా పెట్టాలి, ఎలుకలు ఉండే బొరియలను ఎలా కనిపెట్టాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు కమల, రూప, విఎఎలు జోయ్, భవిత, రైతులు పాల్గొన్నారు. **పిఠాపురం** మండలంలోని 23 గ్రామాల్లోని ఆర్‌ఎస్‌కెల వద్ద ఎలుకల నిర్మూలన మందును రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.స్వాతి ఫక్రుద్దీన్‌పాలెం, పి.రాయవరం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని బ్రోమోడయోలిన్ మందును వినియోగించే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వైవి.గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు. **కరప** మండలంలోని కొంగోడులో ఆర్‌ఎస్‌కె వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త ఎ. సీతారామ శర్మ, సబ్ డివిజన్ ఎడిఎ కె.బాబురావు, మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ సర్పంచ్ బాబులు, రైతులు పాల్గొన్నారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు

సంపద కేంద్రాల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి - గండేపల్లి

గ్రామాల్లో సంపద కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించాలని జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు ఆదేశించారు. బుధవారం గండేపల్లి గ్రామంలో సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రాన్ని అభివృద్ధి చేసిన ఎంపిడిఒ చంద్రరావు, కార్యదర్శి ఫణీంద్రకుమార్‌ను ఆయన అభినందించారు. అనంతరం ఎంపిపి కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండేపల్లిలో మాదిరిగా మండలంలోని అన్ని గ్రామాల్లో సంపద కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.చంద్రరావు, పంచాయతి కార్యదర్శి విఆర్.ఫణీంద్రకుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల హెచ్‌బిఎస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోతంశెట్టి రాజశేఖర్ రెడ్డి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ సాధించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గుజరాత్‌లోని అహ్మదాబాద్ సబర్మతి యూనివర్సిటీ నుంచి రాజశేఖర్‌రెడ్డి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. డాక్టర్ అంజు దహియా నేతృత్వంలో రాజశేఖర్ రెడ్డి సమర్పించిన 'ఇండియన్ సొసైటీ యాజ్ పోర్ట్రయిడ్ ఇన్ ది ఫిక్షన్ ఆఫ్ రూత్ ప్రయర్ జబ్ వాలా' అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు.



రాజశేఖర్‌రెడ్డి

రాజా అశోక్‌బాబును పరామర్శించిన దాడిశెట్టి

ప్రజాశక్తి - కోటనందూరు

మాజీ ఎంఎల్‌ఎ రాజా అశోక్‌బాబును తునిలోని తన నివాసంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా బుధవారం పరామర్శించారు. అశోక్ బాబు కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యమ్రంలో ఎంపిపి లగుడి శ్రీనివాస్, నాయకులు లంక ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో నష్టపోయేది రైతులే

-స్టీల్ ప్లాంట్‌పై సన్నాయి నొక్కులు
-జగన్‌కు ద్వంద్వ వైఖరి చేతకాదు
-మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ


మీడియాతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - కాకినాడ

చంద్రబాబు పాలనలో ఎప్పుడూ నష్టపోయేది రైతులేనని వైసిపి నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు ఎంత సాగు చేస్తున్నారు? ఎంత ఎరువులు అవసరం ఉంటాయి? అనే ప్రణాళిక లేకపోవడం వల్లే రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మొదటి నుంచి చంద్రబాబుకి వ్యవసాయం అన్న, రైతులు అన్న ఇష్టం ఉండదని, అందువలనే రైతుల పంటల విషయంలో నిర్లక్ష్యం వహిస్తారని అన్నారు. అవసరమైన ఎరువులు, గిట్టుబాటు ధర కల్పించడంలోనూ తీవ్రంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు నష్టం కలుగజేస్తున్నారన్నారు. రైతుల సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 9న రైతులతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తామన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌పై కూటమి నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, స్టీల్ ప్లాంట్‌పై ఏ విధమైన నిర్ణయానికి రాకుండా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కాలయాపన చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి చెక్కభజన చేస్తున్నారని విమర్శంచారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం మోడీతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. వైజాగ్ వచ్చి స్టీల్ ప్లాంట్ కోసం పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడలేదన్నారు. విశాఖ ఉక్కు అందరిది అని, స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపడమే వైసిపి ధ్యేయమన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం వైసిపి పోరాడుతుందన్నారు. ఇందుకోసం ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని, పోరాటాన్ని ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లా వరకు చేపడతామని తెలిపారు. ప్లాంట్ కోసం కూటమి నేతలు గతంలో దొంగ దీక్షలు చేశారని ఆయన విమర్శంచారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ ఎంపి వంగా గీతా, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎఎంసి మాజీ ఛైర్మన్ విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తండ్రిని హత్య చేసిన కుమారుడు

ప్రజాశక్తి - కరప

మండలంలోని ఉప్పలంక గ్రామంలో క్షణికావేశంతో కన్న కొడుకే తన తండ్రిని హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలంకకు చెందిన కాలాడి సూర్యచంద్రరావు(50)కు నలుగురు కుమారులు. వీరిలో 3వ కుమారుడు మానసిక వ్యాధితో బాధపడుతుంటాడు. మానసిక రోగికి మందులు తీసుకురావాలని తండ్రి సూర్యచంద్రరావు తన రెండో కుమారుడు చంద్రశేఖర్‌కు మంగళవారం రూ.500 ఇచ్చాడు. ఆ డబ్బులతో మందులు తీసుకురాకుండా మద్యం తాగి రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి రావడంతో చంద్రశేఖర్‌ను తండ్రి నిలదీశాడు. ఆగ్రహానికి లోనైన చంద్రశేఖర్ ఇంటి వద్ద ఉన్న గొడ్డలితో సూర్యచంద్రరావుపై దాడి చేశాడు. ఈ దాడిలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్ద కుమారుడు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. మునికూడలి గ్రామ శివారులో పేకాడుతున్న వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,360, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

60 శాతం స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ పూర్తి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సచివాలయ సిబ్బందికి చౌక డిపో డీలర్లు సహకరించి కొత్త స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. మండలానికి 23,877 రైస్ కార్డులు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 60 శాతం పైగా కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో రోజువారీ స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు.

చర్చిలో వైద్య శిబిరం నిర్వహణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో క్రీస్తు ప్రేమ సువార్త సంఘం చర్చిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ సంఘం ప్రెసిడెంట్ షారోన్ రాజు తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన సన్ ఆసుపత్రి డాక్టర్ శోభాచరణ్ సుమారు వంద మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరికి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ టి.అబ్బులు, సెక్రటరీ యోనా బాబు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర ఉల్లాస్ శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అక్షర ఆంధ్ర ఉల్లాస్ మండల స్థాయి వాలంటీర్లకు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ వివివిఎస్.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ హాజరై మాట్లాడారు. మండలవ్యాప్తంగా 9000 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, మొదట విడతగా 2200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 220 మంది వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి వాలంటీర్‌కూ పది మంది నిరక్ష రాస్యులను కేటాయిస్తామని, వారికి 90 రోజులపాటు శిక్షణ స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ టి.బాలకోటయ్య, ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న, రిసోర్స్ పర్సన్ ఎల్‌ఎన్‌విఆర్‌ఎల్.మూర్తి పాల్గొన్నారు.

మండల కార్యాలయానికి కంప్యూటర్స్ అందజేత

ప్రజాశక్తి-బిక్కవోలు

ఎంపిడిఒ కార్యాలయానికి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం కంప్యూటర్స్, ఫర్నిచర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో వీటిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. అనంతరం ఉల్లాస్ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఉల్లాస్ శిక్షణా తరగతులకు హాజరైన వాలంటీర్లు బిక్కవోలు మండలంలో నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి వారిని అక్షరాస్యులుగా చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎంపిపి తేతలి సుమ పాల్గొన్నారు.

విష జ్వరాల నివారణకు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గోపాలపురం

విష జ్వరాలు ప్రబలకుండా గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని హుకుంపేట పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న రికార్డులను, పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలకుండా గ్రామాలలో సచివాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జ్వరాల రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఎపిడిమోలజిస్ట్ సుధీర్ బాబు, జాన్సన్, పిహెచ్‌సి వైద్యాధికారి బివివి.దుర్గ భవాని, సిహెచ్ఒ ఎస్.రూతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో ప్రొటోకాల్ పాటించడం లేదు

ప్రజాశక్తి-రాజానగరం

క్షేత్ర స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండల సర్పంచ్, ఎంపిటిసిలు ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. మండల పరిషత్ హాల్లో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మండారపు సీతారత్నం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కొత్తతుంగపాడు పంచాయతీ నిధులతో గ్రామంలో రహదారి నిర్మాణం ప్రారంభోత్సవానికి స్థానిక సర్పంచ్ ఎందుకు చెప్పలేదని మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, మండల ఇంజనీరింగ్ అధికారి వినయ్‌ను నిలదీశారు. ప్రైవేట్ పాఠశాలలో నిరుపేద కుటుంబాల విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అమలు చేస్తున్న వివరాలు తెలపాలని జెడ్‌పిటిసి వాసంశెట్టి పెద్ద విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒ జెఎ ఝాన్సీ, కోడి వీరఘవులు, డిటి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అవసరమైన ఎరువులు



ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల సరఫరాపై నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రైతులకు ఎరువుల సమస్య ఉంటే జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఫోన్ నెంబర్ 8331056509కు తెలియచే యాలని ఆయన సూచించారు. యురియా ఎరువు ఆగస్టు నెలలో 18,061 ఎంటిఎస్ ఎరువులు అవసరం కాగా 18,863 ఎంటిఎస్ జిల్లాకు రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రయివేటు డీలర్లు వద్ద 1114 ఎంటిఎస్, పిఎసిఎస్‌ల వద్ద 162 ఎంటిఎస్, ఆర్ఎస్‌కెలలో 648 ఎంటిఎస్ వెరసి 2140 ఎంటిఎస్ యురియా జిల్లాలో అందుబాటులో ఉచినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు యురియా 15 కేజీల చొప్పున దమ్ములో, పిలకల దశలో చిరుపొట్ట దశలో 3 దఫాలుగా పంటకు వేయాలని, రైతులు అధిక మొత్తంలో యురియా వేసినట్లయితే మొక్క ద్రుఢత్వం తగ్గి పురుగులు, చీడపీడలు ముప్పు అధికంగా ఉంటుందన్నారు. కావున రైతులు అవసరం మేరకు ఎరువులు వాడాలని ఆయన సూచించారు. ఈ నెల 6వ తేదీన 1800 ఎంటిఎస్ యురియా జిల్లాకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అదే స్టాక్‌ను జిల్లాలోని అన్ని మండలాలకు ప్రయివేటు డీలర్లు, పిఎసిఎస్, ఆర్ఎస్‌కెలలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎవరైనా యూరియాను బ్లాకు మార్కెటింగ్ లేదా అనధికారికంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 3 షాపుల్లో 24 ఎంటి 9.22 లక్షల అమ్మకాలు నిలుపుదల చేసామని, ఆరు 6ఏ కేసులు నమోదు చేసి 158.8 ఎంటి, 33.9 లక్షలు సీజ్ చేసామని తెలిపారు. అలాగే రబీ 2025 సీజనుకు సరిపడా ఎరువులను ఇప్పటి నుంచే నిల్వ చేయడం జరుగుతుందని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని ఆయన కోరారు.


శంకుస్థాపన చేస్తున్న దాతలు, ఇఒ సుబ్బారావు

దాతలు ముందుకు రావాలి: ఇఒ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ దేవస్థానంలో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు ముందుకు రావాలని దేవస్థానం ఇఒ వీర సుబ్బారావు కోరారు. బుధవారం కొండపైన పరమటి రాజగోపురం ఎదురుగా విశాఖపట్నంకి చెందిన లారీస్ కంపెనీ సహకారంతో రూ.2.50 కోట్ల అంచనాలతో విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులకు దాత కృష్ణంరాజు దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం భక్తుల కోసం పెద్ద విశ్రాంతి షెడ్డు నిర్మించాలని చేసిన విజ్ఞప్తికి స్పందించి ముందుకొచ్చిన దాత కృష్ణంరాజు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు

మండల పరిషత్‌లో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్‌పి సిఇఒ వివివిఎస్. లక్ష్మణరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. రికార్డుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - తుని

పట్టణంలోని అమ్మాజీపేట, శ్రీనివాస థియేటర్ సెంటర్ వద్ద స్మశాన వాటిక అభివృద్ధికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భవనసుందరి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌ఎ యనమల దివ్య నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మంతిన నాగలక్ష్మి, నాయకులు గోవిందరాజులు, వాసంశెట్టి శ్రీను, మొల్లేటి ప్రభావతి, గణేష్, చింతకాయల భారతి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఐడియా స్పార్క్ 2025


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఆదిత్య ప్రతినిధులు

ప్రజాశక్తి - గండేపల్లి

సురంపాలెంలో ఉన్న ఆదిత్య విశ్వవిద్యాలయం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ (ఇడిసి) ఆధ్వర్యంలో ఐడియా స్పార్క్ 2025 విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, బాహ్య స్టార్టప్‌లను ఒకచోట చేర్చి, వారి సృజనాత్మక ఆలోచనలు, ప్రోటోటైప్‌లు, ఉత్పత్తులు, ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 42 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిలో 3 బాహ్య స్టార్టప్‌లు, 6 పూర్వ విద్యార్థుల స్టార్టప్‌లు, 31 విద్యార్థుల ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎం.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ రమేష్ అదిరెడ్డి, డాక్టర్ రామశ్రీ, డీన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇడిసి విద్యార్థులు ఆవిష్కరణలకు ప్రోత్సహించడమే కాకుండా, స్పీడ్‌కాపీ వంటి పూర్వ విద్యార్థుల స్టార్టప్‌లకు వెంచర్‌లను విస్తరించే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



మురుగునీటి గుంటతో ఇక్కట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మురుగునీటి గుంటతో ప్రజలు, సిబ్బంది ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. కాలనీ నుంచి వచ్చే మురుగునీరు మండల పరిషత్ కార్యాలయం వైపు మళ్లడంతో మురికి నీటి గుంట ఏర్పడింది. ఏడాది కాలంగా మురుగునీటి గుంట నుంచి దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మురుగు నీటి గుంటతో ఈగలు, దోమలు పెరిగిపోతున్నాయి. పర్యావరణం, ప్రజారోగ్యం, పారిశుద్యానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పే మున్సిపల్ అధికారులు కళ్లదుట కన్పిస్తునన మురుగినీటి గుంటను పట్టించుకోకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

కాకినాడ జిల్లాలో విలీనం కోసం జెఎసి నడకయాత్ర

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నడకయాత్ర నిర్వహించారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో ప్రారంభమైన ఈ యాత్రలో యోగ వాకర్స్, స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెఎసి కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి.సిద్ధూ, సీనియర్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కష్ణ, పాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విక్టర్ నంద, కౌన్సిలర్లు అంకం శ్రీను, పి.మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆర్‌డి.ఖాన్, తదితరులు నేతృత్వం వహించారు. వారు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచంద్రపురం నుండి 60 కి.మీ. దూరంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కేంద్రం కేవలం 25 కిమీ. దూరంలో ఉండి అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మందపల్లి చిట్టిబాబు, యోగ వాకర్ సభ్యులు కె.చంద్ర శేఖర్, గిరి, పరశువేది బాబ్జి పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెం, బొడ్డు పెదవెంకటాయపాలెం జంట గ్రామాల్లో బుధవారం మహాలక్ష్మి అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెండు గ్రామాల్లో ప్రతి ఏడాది మాదిరిగానే పోటాపోటీగా విద్యుత్ కాంతులతో మెరిశాయి. ఈ జాతరలో ఇరు గ్రామాలకు చెందిన నిర్వాహకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వివాదాస్పద ఫ్లెక్సీలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - మామిడికుదురు

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వివాదాస్పదమైన వాఖ్యలతో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల పై చర్యలు తీసుకోవాలని మండల అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం, ఎంఆర్‌పిఎస్, వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు అప్పనపల్లిలో వివాదాస్పదమైన వ్యాఖ్యలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో బుధవారం నగరం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, సినీ హీరోల అభిమాన సంఘాలు వివాదాస్పద వాఖ్యలతో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కొన్ని కులాలను కించపరిచేలా, రెచ్చగొట్టే విధంగా ఉన్నాయన్నారు ఈ తరహా ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దీనిపై నగరం ఎస్ఐ చైతన్య కుమార్, తహశీల్దార్ సునీల్ కుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు ఈ ఆందోళనలో నల్లి శ్రీనివాస్, గెడ్డం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిసిసి అధికార ప్రతినిధిగా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - కాట్రేనికోన

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా కంచు స్తంభం కిరణ్‌కుమార్(సోనీ) నియ మితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్. షర్మిల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2001వ సంవత్సరం నుంచి సోనీ కాంగ్రెస్ పార్టీలో పని చేశారు.

దుర్గాప్రసాద్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లికి చెందిన జనసేన కార్యకర్త జాలెం దుర్గాప్రసాద్ కుటుంబాన్ని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన జాలెం దుర్గాప్రసాద్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆమె పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జనసేన కార్యకర్తలు ఉలిసి ఐరాజు, మొగిలి గంగాధర్, ఎస్ఎంసి ఛైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, యరమళ్ళ రాజు పాల్గొన్నారు.

యానాం వార్తలు


భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం భూమిపూజ చేశారు. సుమారు రూ.59 లక్షల వ్యయంతో మట్టిపనులు, ఐరన్ వాల్, డ్రెస్సింగ్ రూమ్, ప్రాక్టీస్ పిచ్ తదితర పనులను చేపట్టనున్నారు. సంబంధిత పనులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజాపనుల శాఖ అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ కాళ్ల నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం రాజారామ్, జెఇ జ్యోతిరాజు, రఘు, ప్రసాద్, గ్రామ పెద్దలు మోర్త శ్రీనివాస్, పోతుల జయ, పొలిమారి శ్రీనివాస్, యాళ్ల వెంకట్, నక్కల సుబ్బన్న పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి కమిడి ఎంపిక

ప్రజాశక్తి - యానాం


ప్రభాకరరావు

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి పిఎం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గ్రేడ్-1 హెచ్‌ఎం కమిడి ప్రభాకరరావు ఎంపికయ్యారు. ఈ నెల 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యా శాఖామంత్రి చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకోనున్నారని ఎంఇఒ పంపన లక్ష్మణప్రవీణ్ తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

రెవెన్యూ కార్యాలయంలో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని జెసి రాహుల్ మీనా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కుల గణన సర్వే, ఇళ్ల స్థలాల దరఖాస్తులు, విచారణ నివేదికలు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, సాధారణ రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్లు యడ్ల శ్రీనివాసు, కె.పద్మజ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



పారిశ్రామిక సందర్శనలో ఆదిత్య విద్యార్థులు

సిఎస్ఇ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం బి.టెక్ రెండవ సంవత్సరం విద్యార్థులు కాకినాడలోని క్రిఫీ సాఫ్ట్ వేర్టెక్నాలజీస్ ప్రయివేట్ కంపెనీలో పారిశ్రామిక సందర్శన చేశారు. పరిశ్రమలో అనుసరిస్తున్న తాజా సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు, ఆధునిక సాధనాలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి విధానాలపై విద్యార్థులు అవగాహన పొందారు. ఈసందర్భంగా డిప్యూటీ ప్రో ఛాన్సలర్.డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల విజ్ఞానాన్ని విస్తరించి, వారి ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ విజిట్ కో - ఆర్డినేటర్ డాక్టర్ జాలయ్య సైకం, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి 10వ నెంబర్ రేషన్ షాప్ వద్ద బుధవారం స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాటేపల్లి భద్రం, జనసేన పార్టీ రామకుర్తి నరసింహ, చింతపల్లి వీరభద్రరావు, కాపుగంటి బాబులు, సాకా లక్ష్మణరావు పాల్గొన్నారు.